ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకే...


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు, చిత్రంలో నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి తదితరులు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- ముగిసిన 'జగనన్నే మా భవిష్యత్తు'
- జిల్లా కేంద్రంలో ర్యాలీ, బహిరంగ సభ

పార్వతీపురం టౌన్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేలో ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని, రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వే శనివారం చివరి రోజు సందర్భంగా పట్టణంలో ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి సమక్షంలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాతబస్టాండ్ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులు

చేసిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మెగా పీపుల్స్ సర్వేలో జగనన్నకు అపూర్వమైన మద్దతు లభించిందన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులు నిబద్ధత, పట్టుదలతో పని చేసి ఈ సర్వేను పారదర్శకంగా నిర్వహించారన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేపట్టని అతి పెద్ద పబ్లిక్ సర్వేగా జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వే నిలిచిందన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో 92 శాతానికి పైబడి కుటుంబాలను పార్టీ శ్రేణులు కలిశాయన్నారు. 75 వేల కుటుంబాలను సందర్శించామని, 60 వేల మిస్డ్ కాల్స్ ఇచ్చి ప్రజా మద్దతు తెలిపారన్నారు. జగనన్న పాలనలో అవినీతి లేని పారదర్శక పాలన అందుతుందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని చంద్రబాబు ఖూనీ చేశారన్నారు. జన్మభూమి కమిటీలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. జగనన్న పాలనలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. అభివృద్ధిలో అగ్రగామిగా ఉన్నామని తెలిపారు. టీడీపీ నాయకులు ప్రజల నుంచి వైఎస్సార్‌సీపీకి లభిస్తున్న మద్దతుతో ఓర్వలేక మతిలేని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు జేసీఎస్ కన్వీనర్లు, మున్సిపల్ చైర్మన్లు, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ అభిమానులు, ప్రజలు

విద్యార్థినికి సత్కారం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 4వ వార్డు తూర్పు వీధికి చెందిన గెంబలి విజయగౌరి ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 985మార్కులు సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా శనివారం పాతబస్టాండ్ జంక్షన్ వద్ద జరిగిన బహిరంగ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు విద్యార్థిని విజయగౌరిని కీర్తిస్తూ ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు నాగరాజు, రాధ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గీతా మందిరం అభివృద్ధికి విరాళం


మందిర నిర్మాణకర్తకు విరాళం అందజేస్తున్న దాతలు

బలిజిపేట: పెదపెంకి గీతా మందిరం అభివృద్ధికి దాతలు రూ.10వేలు విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన ఈర్ల నారాయణరావు భార్య సత్యవతి జ్ఞాపకార్థం గీతామందిరం అభివృద్ధికి రూ.10వేలు విరాళంగా ఇచ్చినట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని మందిర నిర్మాణకర్త సాధుకు అప్పగించారు. కార్యక్రమంలో ఈర్ల సంజీవనాయుడు, ఎం.అప్పలనాయుడు, బి.లక్ష్మణ్, పి.తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీ

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో గల ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఏర్పడిన మూడు అంగన్‌వాడీ కార్యకర్తలు, 9 అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వివాహితులు మే 6వ తేదీలోగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి అందజేసి రసీదును పొందాలని కోరారు. పాలకొండ మున్సిపాల్టీ ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, మూడు సహాయకురాళ్లు, పార్వతీపురం పరిధిలో ఒక అంగన్‌వాడీ సహాయకురాలు, బొబ్బిలి రూరల్ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఐదు అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టులు ఉన్నాయని తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

సాలూరు: వేసవి దృష్ట్యా మున్సిపాలిటీలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. 14వ ఆర్థిక సంఘం నిధులు, పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిల్ సభ్యులతో పాటు కమిషనర్ శంకరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసిరితల్లికి ఊయలసేవ


అసిరితల్లికి ఊయలసేవ చేస్తున్న భక్తులు


పాలకొండ రూరల్: అసిరితల్లి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కొండాపురం గ్రామంలో అమ్మవారికి శనివారం ఊయలసేవ నిర్వహించారు. అమ్మవారి ఘటాన్ని ఊయలలో ఉంచి, ఊపుతూ ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే


నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

భామిని: మండలంలోని నేరడి–బి ఎంపీయూపీ స్కూల్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థులంతా కలిసి ఎనిమిదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఎక్కడ చదువుకున్నా మంచి విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రోహిణీశ్వరరావు, సచివాలయ వెల్ఫేర్‌అసిస్టెంట్ సుధారాణి పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 20 మంది ఎంపిక


రోగి కళ్లను తనిఖీ చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి కృష్ణారావు

పాలకొండ రూరల్: వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెజ్జి గ్రామ సచివాలయం వద్ద నేత్రవైద్య శిబిరం నిర్వహించి, 92 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 20 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. మరో 45 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి టి.కృష్ణారావు, సీహెచ్‌ఓ కె.రేణు, ఏఎన్ఎం బి.రాములమ్మ, హెచ్‌ఏ శంకరరావు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఐఓ డాక్టర్ జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని 15, 18, 19 వార్డులకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య స్థితి వివరాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. మునుపటి నెలల్లో నమోదైన గణాంకాలకు, ప్రస్తుతానికి ఉన్న మార్పును పరిశీలించారు. కొంత మంది పిల్లలు బరువు, ఎత్తు ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి వయస్సుకు తగ్గట్టుగా ఉన్నదీ లేనిదీ గమనించారు. ఎమ్‌సీపీ కార్డులో ఉన్న గ్రోత్ చార్ట్‌లో ప్రతి నెలా నమోదు చేయాలని, సాధారణ స్థితిలో లేని వారిని గుర్తిస్తే ప్రత్యేక పర్యవేక్షణ చేసి అవసరమైతే ఎన్‌ఆర్‌సీ కేంద్రానికి పంపించాలని సూచించారు. అనంతరం ఆయన ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్స్, మాత్రలు లభ్యతను పరిశీలించారు. వారానికి రెండసార్లు తప్పకుండా పిల్లలకు ఐరన్ సిరప్ వేయాలని వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నెలా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయ సమావేశం జరిపి పిల్లల, గర్భిణుల ఆరోగ్యంపై సమీక్ష చేయాలని డీఐఓ సూచించారు. సూపర్‌వైజర్ జచగౌడ్, ఏఎన్ఎమ్ నారాయణమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నారుల ఎత్తును పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ జగన్‌మోహనరావు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బలిజిపేట: బలిజిపేట ప్రాజెక్టు పరిధిలో ఉన్న బలిజిపేట, సీతానగరం మండలాల్లో ఒక అంగన్‌డీ కార్యకర్త, 5హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు మే 6వ తేదీ లోగా బొబ్బిలి రూరల్ ఐసీడీఎస్ కార్యాలయానికి అందించాలని బలిజిపేట ప్రాజెక్టు అధికారిణి పీఓ సుగుణ శనివారం తెలిపారు. బలిజిపేట మండలం గౌరీపురం అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఎస్టీకి కేటాయించబడింది. అభ్యర్థులు గ్రామ స్థానిక వివాహిత అయి ఉండాలని, జూలై 1, 2022వ తేదీకి 21–35సంవత్సరాల మధ్య వయసు ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులు దరఖాస్తులు చేయాలని పీఓ సుగుణ తెలిపారు.

హెచ్‌సీ కృష్ణమూర్తికి సన్మానం

పార్వతీపురం టౌన్: పట్టణానికి చెందిన కానిస్టేబుల్ కృష్ణమూర్తిని ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం పాతబస్టాండ్ కూడలిలో జరిగిన బహిరంగ సభలో ఘనంగా సత్కరించారు. కృష్ణమూర్తి పార్వతీపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులను నిర్వహిస్తూ మరోవైపు తమ సంపాదనలో కొంతభాగం పేద ప్రజల కోసం ఖర్చు చేస్తూ నిరంతరం సేవగుణంతో పరితపిస్తుంటాడు. ఈ మేరకు ఉత్తమ సేవా గుణం కలిగిన కృష్ణమూర్తిని ఎమ్మెల్యే జోగారావు సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ

బలిజిపేట: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి విద్యాభివృద్ధికి తల్లితండ్రులు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ కోరారు. బడేవలస ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడేవలస పాఠశాల పునఃప్రారంభం జరిగిందని, ఇక్కడ విద్యార్థులు మంచి బాగా చదువుకుంటున్నారని తెలిపారు. తల్లి తండ్రులు బడిఈడు పిల్లలను ఇతర ప్రాంతాల పాఠశాలల్లో చేర్చకుండా గ్రామంలో ఉండే పాఠశాలలోనే చేర్పించాలన్నారు. ప్రభుత్వం నుండి అన్నీ ఉచితంగా అందుతున్నాయని తెలిపారు. ఉప సర్పంచ్ కృష్ణ మాస్టారు, విద్యా కమిటీ చైర్మన్ సింహాచలం, తల్లితండ్రులు పాల్గొన్నారు.

పి.రావివలసలో ఫ్యామిలీ డాక్టర్

బలిజిపేట: బలిజిపేట పీహెచ్‌సీ పరిధిలోని పి.రావివలసలో వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి శనివారం ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందించారు. గ్రామంలో 75మందికి, కేంద్రం వద్దకు రాలేని వారికి ఇంటికి వెళ్లి వైద్య సేవలను అందించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. వేసవి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, డీఈఓ ప్రసాదు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఎంపీహెచ్‌ఏ రాము, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


రావివలసలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి

రహదారి భద్రత నియమాలు పాటించాల్సిందే..


వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనచోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువ పత్రాలు వెంట ఉంచాలన్నారు. ఓవర్ లోడ్‌తో వాహనాలు నడవరాదని హెచ్చరించారు. సరుకు రవాణా వాహనాలలో ప్రజా రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యక్రమంలో సిబ్బంది ఏఎస్‌ఐ రాజారావు, కిషోర్, సంపత్, ఆటో డ్రైవర్‌లు, వాహనచోదకులు పాల్గొన్నారు.

లక్ష్యాలతో కూడిన విద్యను అభ్యసించాలి

సాలూరు: విద్యార్థులు లక్ష్యాలతో కూడిన విద్యను అభ్యసించాలని ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజి అన్నారు. మండలంలోని మామిడిపల్లి జెడ్పీహెచ్ పాఠశాల, కురుకుటి ఆశ్రమ పాఠశాలను ఆయన శనివారం పరిశీలించారు. మామిడిపల్లి పాఠశాలలో ఇటీవల ఆగంతకులు పాఠశాలలో సామగ్రిను ధ్వంసం చేసిన సంఘటనపై ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సహకారంతో పాఠశాలల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుందని తెలిపారు. అనంతరం కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొని ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన రాగిజావ పంపిణీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్లాసులను పంపిణీ చేశారు. అనంతరం వుయ్ లవ్ రీడింగ్, వేసవిల్లో ఉపాధ్యాయులు చేపడుతున్న విద్యాప్రణాళికా అంశాలపై చర్చించారు. ఆయన వెంట ఎంఈఓ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజి

ఉపాధి పనుల పరిశీలన

భామిని: మండలంలోని బొడ్డగూడ, ఏటంగూడ గిరిజన గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు శనివారం పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనులు చేస్తున్న వారికే మస్తరు వేయాలని ఆయన సూచించారు. నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేస్తే రోజుకు రూ.257 గిట్టుబాటు వేతనం వస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో వేతనదారులు వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు.


బొడ్డగూడ కొండపై జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

పక్కాగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు

వీరఘట్టం: వేసవి నేపథ్యంలో పక్కాగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదేశించారు. మండలంలోని వండవ గ్రామంలో తన నివాసంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శనివారం సమావేశమైన ఆమె గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాడైన తాగునీటి బోర్లను యుద్ధప్రాతిపదికన బాగుచేసి, తాగునీరు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, డీఈ ఢిల్లేశ్వరరావు, ఏఈ పాపారావు పాల్గొన్నారు.

నేటి నుంచి పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు

వీరఘట్టం: స్థానిక పట్టణంలో ఆదివారం నుంచి పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. మే 10వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు, యాత్రికులు, పర్యాటకులు, సందర్శకులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాల ప్రారంభం నా డు ఉదయం యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఉజ్జిడి పోలమ్మ సంబరం చేస్తారు. సోమవారం సాయంత్రం వనంలోని పైడితల్లి అమ్మవారిని ఊరేగింపుగా ఊరిలోకి తీసుకువచ్చి, బోయి డు ఇంట్లో కొలువుదీరుస్తారు. 3వ తేదీన అమ్మవారి ఘటాలు, పాలజంగిడిని వీధుల్లో ఊరేగిస్తారు. 9వ తేదీన అంజలిరథం, సిరిమానోత్సవాలను అత్యంతం వైభవంగా నిర్వహిస్తారు. ఇప్పటికే అమ్మవారి ఆలయానికి సరికొత్త రంగులద్ది, ముస్తాబు చేశారు. మందిరం ఆవరణ, సమీప వీధులన్నీ విద్యుత్‌దీపాలంకరణతో ఓ వెలుగు వెలిగిపోతున్నాయి. దాదాపు తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రోజు కో సాంస్కృతిక కార్యక్రమంతో ప్రజలను అలరించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది.

వాహనాల వేలం ద్వారా రూ.3.58 లక్షల ఆదాయం

పాలకొండ రూరల్: స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 15 ద్విచక్ర వాహనాలను శనివారం వేలం వేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుధాకర్ నేతృత్వంలో జరిగిన ఈ వేలంలో 11 వాహనాలను ఔత్సాహికులు కొనుగోలు చేయగా, రూ.3,58,650 ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. మిగిలిన నాలుగు వాహనాలకు త్వరలోనే వేలంపాట నిర్వహిస్తామని సీఐ గోపాలకృష్ణ, ఎస్‌ఐ మహేష్ రెడ్డి తెలిపారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

జియ్యమ్మవలస: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్.రమేష్ సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లపుసిరిపి గ్రామంలో జగనన్న కాలనీ ఇళ్లి నిర్మాణాలను ఆయన శనివారం పరిశీలించారు. నిర్మాణాలు చేస్తున్న వారికి సకాలంలో నిర్మాణ సామగ్రి, బిల్లులు చెల్లించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దూరులో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ డీఈ పి.మోహనరావు శనివారం పరిశీలించారు. డివిజన్‌లోని ఏడు మండలాల్లో మొత్తం 2,611 ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టి, పూర్తి చేయాలని డీఈ సూచించారు. నిర్మాణాలు చేస్తున్న వారీగా దశల వారీగా నిర్మాణ సామగ్రి, బిల్లులు ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏఈ వి.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్ల ఏర్పాటు


సరిహద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జేసీ పి.విష్ణుచరణ్

సీతానగరం: జిల్లాలో భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్ల ఏర్పాటుచేయాలని ఐటీడీఏ పీఓ, ఇన్‌చార్జి జేసీ పి.విష్ణుచరణ్ రెవెన్యూ, సర్వే సిబ్బందిని ఆదేశించారు. సీతానగరం మండలం పాపమ్మవలస, నీలకంఠాపురం గ్రామాల్లో సరిహద్దురాళ్ల ఏర్పాటు తీరును శనివారం పరిశీలించారు. మండలానికి సమకూర్చిన 5 రోవర్ల సాయంతో సరిహద్దు రాళ్లు వేస్తున్నామని తహసీల్దార్ ఎస్.వి.రమణ వివరించారు. ఒక్కో గ్రామంలో 80 నుంచి 100 రాళ్లు వేస్తున్నామన్నారు. ఈ క్రతువులో మండల సర్వేయర్ శంకరరావుతో పాటు వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు నిమగ్నమయ్యారన్నారు.

వేగవంతంగా గృహనిర్మాణాలు

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను విష్ణుచరణ్ ఆదేశించారు. కాశీపేటలోని జగనన్న కాలనీలో జరుగుతున్న గృహనిర్మాణాలను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ పీడీ రఘురాం, తహసీల్దార్ ఎస్.వి.రమణ, ఎంపీడీఓ ఎం.ఎల్.ఎస్.ప్రసాద్, హౌసింగ్ ఏఈ జానకిరాం, సర్పంచ్ టి. ధనంజయమ్మ, పంచాయతీ కార్యదర్శి మురళీ పాల్గొన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలి

గరుగుబిల్లి: వేసవి ఎండల నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఎ.ప్రియాంక సూచించారు. శనివారం మండలంలోని ఉల్లిభద్ర గ్రామ సచివాలయం పరిధిలోని సీతారాంపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, పలువురికి వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉపాధి హామీ పనులతో పాటు ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారంతా గొడుగు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. వీలైనప్పుడల్లా ఓఆర్‌ఎస్, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తాగాలన్నారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది రమణమ్మ, అనిత, మాలతి, రామకృష్ణ పాల్గొన్నారు.


రోగుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక